క్లుప్తంగా

వర్మీకంపోస్ట్ తయారీ


వర్మీ కంపోస్ట్‌ను సంచుల్లో నింపుతున్న దృశ్యం

కొలిమిగుండ్ల: మండలంలోని ఇటిక్యాల గ్రామ పంచాయితీలో ఏర్పాటు చేసిన చెత్త సంపద తయారీ కేంద్రంలో వర్మీకంపోస్ట్ తయారు చేసినట్లు పంచాయితీ కార్యదర్శి రాఘవరెడ్డి సోమవారం తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులు తడి,పొడి చెత్తను సేకరించి చెత్త సంపద కేంద్రంలో కంపోస్ట్ తయారు చేశారని చెప్పారు. రైతుల పంట పొలాల్లో వేసుకునేందుకు ఇది ఎరువుగా ఉపయోగపడుతుందన్నారు. రైతులకు విక్రయించి పంచాయతీల ఆదాయ మార్గం పెంచుకునేందుకు దోహదపడుతుందన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

కొలిమిగుండ్ల: స్థానిక కస్తూర్బా పాఠశాల ఎదురుగా 544–డీ జాతీయ రహదారి చెంతనున్న జగనన్న కాలనీలో రెండు రోజుల నుంచి విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే అధికారులు కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా కల్పించారు.రెండు బోర్లు వేయడంతో మోటార్ అమర్చి లబ్ధిదారులకు నీటి సౌకర్యం అందిస్తున్నారు.ప్రస్తుతం కాలనీలో విద్యుత్ స్తంభాల కోసం బోర్‌వెల్ సాయంతో డ్రిల్లింగ్ చేసి స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. కాలనీలో 80కి పైగా గృహ నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి.

శనగలు తక్కువ ధరకు అమ్ముకోవద్దు

కొలిమిగుండ్ల: రైతులు శనగలను తొందరపడి తక్కువ ధరకు అమ్ముకోవద్దని వ్యవసాయాధికారి పవన్ కుమార్ సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ త్వరలోనే కేంద్ర ప్రభుత్వ సంస్థ నాఫెడ్ ఆధ్వర్యంలో క్వింటా రూ.5,335 ధరతో కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. ఈ–పంట నమోదు చేసుకొని ఈ–కేవైసీ పూర్తి చేసుకున్న రైతులు మాత్రమే శనగలు విక్రయించేందుకు అర్హులవుతారని చెప్పారు. ఆయా రైతు భరోసా కేంద్రాల్లో ఈ–పంట జాబితాలో పేర్లు సరి చూసుకోవాలన్నారు. రైతులు తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దని కోరారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ

ప్యాపిలి: మండలంలోని సిద్దనగట్టు గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రముఖ న్యాయవాది నాగభూషణ్ రెడ్డి సోమవారం క్రీడా పరికరాలు పంపిణీ చేశారు. తండ్రి ముడియాల నారాయణ రెడ్డి జ్ఞాపకార్థం విద్యార్థులకు రూ.4,500 విలువ చేసే క్రీడాపరికరాలు అందజేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎంఎన్ఆర్ రూరల్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ సొసైటీ పేరుతో ఏటా కార్యక్రమం చేపడుతున్నట్లు నాగభూషణ్ రెడ్డి చెప్పారు.

15న మండల సర్వసభ్య సమావేశం

అవుకు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఈనెల 15వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అజాంఖాన్ సోమవారం తెలిపారు. ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి మండల స్థాయి అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో హాజరు కావాలని సూచించారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– అవుకు ఆర్అండ్‌బీ రహదారిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కొలిమిగుండ్ల మండలం బెలూం గ్రామానికి చెందిన పది మంది కూలీలు ఆటోలో వ్యవసాయ పనులకు బయలుదేరారు. సంజామల మండలం ఆకుమల్ల గ్రామం వద్ద ఐదుగురు దిగారు. మిగిలిన వారిని కోవెలకుంట్ల మండలం చిన్న కొప్పెర్ల గ్రామానికి తీసుకొస్తుండగా మదిగేడు గ్రామ సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తోపాటు అందులో ప్రయాణిస్తున్న సరళమ్మ, శివమ్మ అనే కూలీలు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

డోన్ టౌన్: ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి శివరాం, మండల అధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. స్థానిక కార్యాలయంలో సోమవారం మ్యాజిక్ ఆటో యూనియన్ కమిటీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు లేక రవాణా రంగాన్ని ఉపాధిగా మార్చుకున్న వారిని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం డీజిల్,పెట్రోల్ రేట్లను జీఎస్టీ పరిధిలోకి తీసుకు రావడానికి సాకులు చెబుతోందని, వాహనాలపై అధిక పన్నులు విధిస్తూ భారం మోపడం సరైంది కాదన్నారు. సీఐటీయూ కోశాధికారి నాగమద్దయ్య, యూనియన్ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

18 నుంచి ముచ్చట్లలో ఉత్సవాలు


ప్రత్యేక అలంకరణలో ముచ్చట్ల మల్లికార్జున స్వామి


ముస్తాబైన డోన్ పాతబుగ్గ దేవాలయం


ముచ్చట్ల భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయం

బేతంచెర్ల : దేవతలే ముచ్చటపడి భూలోకంలో ఒక శైవ క్షేత్రాన్ని నెలకొల్పిన పవిత్ర స్థలంగా ప్రసిద్ధి కెక్కింది ముచ్చట్ల భ్రమరాంబ, మల్లికార్జున స్వామి ఆలయం. 18 నుంచి 21వ తేదీ వరకు జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు ఆలయం ముస్తాబు అవుతోంది. బేతంచెర్లకు 5 కి. మీ. దూరంలో హెచ్.కొట్టాల గ్రామ సమీపంలో ఆలయం ఉంది. హెచ్.కొట్టాల గ్రామం వరకు డోన్ రహదారిలో బస్సులు బేతంచెర్ల, డోన్‌కు వెళ్తుంటాయి. అక్కడ నుంచి రెండు కిలోమీటర్ల మేర నడిచి వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించుకోవచ్చు.

మంత్రి చొరవతో ఆలయానికి రహదారి..

ఎన్నో సంవత్సరాలు సరైన రహదారి లేక ఆలయానికి వెళ్లే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను దృష్టిలో ఉంచుకొని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవతో రూ.3 కోట్లతో గత ఏడాది రహదారి వేయించారు. దీంతో భక్తులకు సౌకర్యంగా మారింది. 18న మహాశివరాత్రి, 19న కల్యాణం, 20న రథోత్సవం, 21న వసంతోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ మద్దిలేటి, మాజీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు.

ముస్తాబవుతున్న శివాలయాలు..

మండంలోని యంబాయి గ్రామంలో వెలసిన నీలకంఠేశ్వర, భోగేశ్వరస్వామి, సిమెంట్‌నగర్ గ్రామ సమీపంలో వెలసిన జీవబుగ్గ లింగేశ్వరస్వామి, బైనపల్లె, రహిమానుపురం, ముసలాయిచెర్వు, ఆర్ఎస్ రంగాపురం గ్రామాల్లో వెలసిన కాశీ విశాలక్ష్మి, విశ్వేరస్వామి ఆలయాలు ఉత్సవాలకు ముస్తాబవుతున్నాయి.

డోన్: ఈనెల 18వ తేదీ నుంచి జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు నియోజకవర్గంలోని శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. పట్టణంలోని పాతబుగ్గ, కొత్త బుగ్గ రామలింగేశ్వర దేవాలయాలతో పాటు బోడ బండ పక్కీరప్ప స్వామి ఆలయంలో ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. ప్యాపిలి మండలంలోని బుగ్గ పల్లె, కాకులారం, బేతంచెర్ల మండలంలోని ముచ్చట్ల దేవాలయాల్లో మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వాహకులు ఏర్పాట్లను పూర్తిచేశారు.


ప్రత్యేక అలంకరణలో గుండు మల్లేశ్వరస్వామి

ఉత్సవాలకు ముస్తాబు

కొలిమిగుండ్ల: మహాశివరాత్రి ఉత్సవాలకు పెట్నికోట సమీపంలోని గుండుమల్లేశ్వరస్వామి ఆలయం ముస్తాబవుతోంది. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉదయ్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. ఆలయానికి రంగులు వేసి పరిసరాలు శుభ్రం చేస్తున్నారు. 18న శివరాత్రి సందర్భంగా ప్రసన్న పార్వతి గుండు మల్లేశ్వరస్వామికి సుప్రభాత సేవ, గణాధిపతి పూజ, రుద్రాభిషేకం, లింగోద్భవ కాలాభిషేకం తదితర ప్రత్యేక పూజలతో పాటు స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. నాయినపల్లె,పెట్నికోట గ్రామాల నుంచి భక్తులు తరలి రానుండటంతో ఏర్పాట్లు పూర్తి చేశారు. 17నుంచి 20వ తేదీ వరకు భక్తులకు అన్నదానం చేయనున్నారు. పండుగ రోజు రాత్రి జాగరణలో భాగంగా విజయవాడకు చెందిన కళాకారులతో బాలనాగమ్మ నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు. అలాగే ఆలయ క్రీడా మైదానంలో రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్,కబడ్డీ పోటీలు ఏర్పాటు చేశారు. పాలపళ్ల,యు కేటగిరీ విభాగంలో రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు కూడా నిర్వహించనున్నారు.

శివపార్వతులకు పల్లకీ సేవ


శివపార్వతులకు పల్లకోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతులకు పల్లకీ సేవ సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ తొటబుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం శ్రీ ఉమామహేశ్వరస్వామికి అభిషేకం,అర్చన తదితర విశేష పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో ఆశీనులు గావించి ఊరేగించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించండి

బనగానపల్లెరూరల్: రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ కో ఆర్డినేటర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు,కళాశాలల్లోని ఓటర్లను కోరారు. సోమవారం ఆయా ప్రాంతాల్లో ప్రచారం చేసి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. శ్రీనివాసులు మాట్లాడుతూ వెన్నపూస రవీంద్రారెడ్డి గెలిస్తే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారించేందుకు కృషి చేస్తారని చెప్పారు. నాయకులు శ్రీకాంత్,సుధాకర్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పాఠశాలలోనే చేయాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ క్రిస్టఫర్

ప్యాపిలి: మధ్యాహ్న భోజనానికి విద్యార్థులు ఇళ్లకు వెళ్లడం సరికాదని, తప్పకుండా పాఠశాలలోనే భోజనం చేయాలని డిప్యూటీ ఈఓ క్రిస్టఫర్ తెలిపారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం తినేవారి సంఖ్య చాలా తక్కువగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి భోజనం నాణ్యతగా ఉండేలా చర్యలు తీసుకుందన్నారు. అయినప్పటికీ విద్యార్థులు తినకపోతే ఎలా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మధుసూదన శర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాహనాల వేలం


మోటార్ సైకిళ్ల వేలం నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లె: బనగానపల్లె, అవుకు పోలీసు స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు సోమవారం డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో 30 వాహనాలకు జీఎస్టీతో కలిపి రూ.3.30 లక్షల ఆదాయం వచ్చిందని సీఐ సుబ్బరాయుడు తెలిపారు. సెబ్ సీఐ సుభాషిణి, బనగానపల్లె, అవుకు, నందివర్గం ఎస్ఐలు రామిరెడ్డి, జగదీశ్వరరెడ్డి, రామాంజనేయరెడ్డి పాల్గొన్నారు.

అవుకు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన వాహనాల వేలంలో రూ.2.23 లక్షలు ఆదాయం వచ్చిందని ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. మండలంలో పలుచోట్ల ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడి సీజ్ చేసిన వివిధ రకాల వాహనాలను డోన్ డీఎస్పీ శ్రీనివాస రెడ్డి, బనగానపల్లె సీఐ సుబ్బరాయుడు, సెబ్ సీఐ సుభాషిణి ఆధ్వర్యంలో వేలం నిర్వహించామని చెప్పారు. సీజ్ చేసిన 27 మోటర్ సైకిళ్లు, ఒక కారును వేలం వేయగా 23 మోటార్ సైకిళ్లను పాటదారులు రూ. 2.23లక్షలకు దక్కించుకున్నారని వివరించారు.

ఉపాధి అవకాశాలను వినియోగించుకోండి


మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్: విద్యావంతులైన నిరుద్యోగులు అంది వచ్చిన ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ సూచించారు. స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో సోమవారం నిర్వహించిన ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిషిప్ మేళా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, ప్రతిఒక్కరిలోనూ సామర్థ్యం, నైపుణ్యం అంతర్లీనంగా ఇమిడివుంటాయన్నారు. నైపుణ్యాన్ని వెలికితీసే అవకాశాలు వచ్చినప్పుడు యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. సాంకేతిక శిక్షణ పొందిన వారికి దేశంలో కొదవ లేదన్నారు. నేషనల్ అప్రెంటిషిప్ మేళాలో 7 కంపెనీలు పాల్గొనగా, ఐటీఐలో శిక్షణ పొంది అప్రెంటిషిప్ పూర్తయిన వారు 72 మంది హాజరు కాగా 40 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని వివరించారు. అనంతరం ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రాయపురెడ్డి పాల్గొన్నారు.

సరోజినీనాయుడుని ఆదర్శంగా తీసుకోవాలి

డోన్ టౌన్: స్వాతంత్ర సమరయోధురాలు సరోజినీనాయుడిని మహిళలు ఆదర్శంగా తీసుకొని సమాజ సేవకు అంకితం కావాలని, పోరాట స్ఫూర్తిని పెంపొందించుకోవాలని హెచ్‌ఎం మైమున్నీసా, సామాజిక కార్యకర్త, భ్రూణ హత్యల నివారణ కమిటీ సభ్యుడు మహ్మద్‌రఫి కోరారు. సరోజినీ నాయుడు జయంతిని పురస్కరించుకొని సోమవారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు


ప్రత్యేకం అలంకరణలో శివ లింగం

డోన్ టౌన్: స్థానిక వైఎస్సార్ నగర్‌లో వెలిసి శివాలయంలో సోమవారం సాయిత్రం అర్చకులు హరి ఆధ్వర్యంలో భక్తులు, శివ మాలధారులు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివ లింగాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించి జ్యోతులు వెలిగించారు. ఆనంతరం మహా మంగళ హారతి ఇచ్చి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివ మాలధారుల భజనలు భక్తులను అలరించాయి.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీఓ వెంకటరెడ్డి

డోన్: త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామని ఆర్‌డీఓ వెంకటరెడ్డి తెలిపారు. టీచర్స్ , గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. సోమవారం ఆయన పోలీసుస్టేషన్ రోడ్డులోని శ్రీసుధ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. తహసీల్దార్ విద్యాసాగర్, ఎంఈఓ ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్యాపిలి: ఎమ్మెల్సీ ఎన్నికలకు కేటాయించిన పోలింగ్ కేంద్రం బాలుర ఉన్నత పాఠశాలను తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ సోమవారం పరిశీలించారు. ఆయన హెచ్‌ఎం మధుసూదన శర్మతో మాట్లాడారు. పాఠశాలలో విద్యుత్ సౌకర్యం, ర్యాంపులు తదితర సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రంలో మొత్తం 1,442 మంది పట్టభద్రులు, 18 మంది ఉపాధ్యాయులు ఓటు వేయనున్నట్లు తెలిపారు. గతంలో రెండు బూత్‌లు ఉండగా ప్రస్తుతం మరో బూత్‌ను అదనంగా కేటాయించినట్లు చెప్పారు.

కోవెలకుంట్ల: వచ్చే నెల 13వ తేదీన నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ పుష్పకుమారి, ఎంపీడీఓ మహబూబ్‌దౌలా సోమవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ కర్నూలు, కడప, అనంతపురం పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల భర్తీకి ఎన్నికల కమిషన్ ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ఇందుకు గాను కోవెలకుంట్ల మండలంలో మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలో పట్టభద్రుల ఎమ్మెల్సీకి రెండు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి ఒకటి చొప్పున పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుకాగా వాటిని తనిఖీ చేసినట్లు చెప్పారు.

నిందితుడికి రిమాండ్

కోవెలకుంట్ల: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి సోమవారం మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు. పాణ్యం మండలం కొనిదేడు గ్రామానికి చెందిన సుబ్బయ్య అనే వ్యక్తి ఓ మైనర్ బాలికను తీసుకెళ్లి వివాహం పేరుతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు సుబ్బయ్యపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పట్టణ శివారులో నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరుచగా మేజిస్ట్రేట్ రిమాండ్ ఆదేశించారని ఎస్ఐ పేర్కొన్నారు.

పోకిరీల ఆట కట్టించిన పోలీసులు

డోన్ టౌన్: పట్టణంలోని వివిధ కళాశాలలు, పాఠశాలల వద్ద ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్న పోకిరీల భరతం పట్టారు పోలీసులు. సోమవారం సీఐ శేషయ్య ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ విద్యా సంస్థల వద్ద వెకిలి చేష్టలకు పాల్పడుతున్న వారిని అదుపులోకి తీసుకొని విభిన్న రకాల హేర్ స్టైల్ ఉన్న వారికి సాధారణ కటింగ్ చేసి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. సాయంత్రం నుంచి ప్రారంభమైన ప్రక్రియ రాత్రి వరకు కొనసాగింది. ఈ విషయం పట్టణంలో దావానంలా వ్యాపించడంతో విభిన్న కేశ ధారణ ఉన్న వారు రోడ్లపైకి వచ్చేందుకు వెనకాడారు. సీఐ మాట్లాడుతూ పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనిస్తుండాలని, చెడు అలవాట్లకు బానిసలు కాకుండా, దుస్తులు, వేషధారణపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

వేధింపుల కేసు నమోదు

ఉయ్యాలవాడ: మండలంలోని మాయలూరు గ్రామానికి చెందిన ఓ వివాహితపై ఆదే గ్రామానికి చెందిన నాగేంద్ర అనే వ్యక్తి వేధింపులకు గురిచేస్తుండటంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఎస్ఐ మాట్లాడుతూ ఈ నెల 9న మహిళ తన పొలంలో పనులు చేసుకుంటుండగా నాగేంద్ర దాడి చేసి, అసభ్యకర పదజాలంతో దూషించాడని బాధితురాలు పేర్కొందని చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.


ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వలో నీటి ప్రవాహం


బనగానపల్లె వద్ద కళకళలాడుతున్న వరి పైరు

నీరు సమృద్ధిగా.. పంటలు పచ్చగా


ఆయకట్టు పరిధిలో సాగు చేసిన వేరుశనగ పంట

బనగానపల్లె: ఎస్సార్‌బీసీ ద్వారా నీటి ప్రవాహం సమృద్ధిగా ఉండటంతో రైతులు రెండో పంట సాగు చేశారు. ప్రస్తుతం పంటలు పచ్చగా కళకళలాడుతున్నాయి. కాలువ ద్వారా ఏప్రిల్ వరకు నీటిని విడుదల చేస్తారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, సంబంధిత అధికారులు పేర్కొనడంతో రైతులు ధైర్యంగా పంటలు సాగు చేశారు. నియోజకవర్గంలోని బనగానపల్లె, అవుకు, కోవెలకుంట్ల, సంజామల మండలాల పరిధిలో సుమారు 74వేల ఎకరాలకు ఎస్సార్‌బీసీ ద్వారా సాగునీరందుతోంది. 2018 చివరి వరకు డిసెంబరు చివరి వరకే సాగునీరు విడదలయ్యేది. దీంతో రైతులు ఖరీఫ్ పంటలు మాత్రమే సాగు చేసేవారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగనే ఎస్ఆర్‌బీసీకి అనుసంధానంగా ఉన్న గోరుకల్లు రిజర్వాయర్‌కు నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయించారు. అప్పటి నుంచి గోరుకల్లు రిజర్వాయర్‌లో నిల్వ ఉంచిన నీటిని ఎస్సార్‌బీసీ ద్వారా ఏప్రిల్ చివరి వరకు సాగునీటిని విడుదల చేస్తుండటంతో అన్నదాతలు రబీలోనూ నీటి ఆధార పంటలు సాగు చేసి సిరులు పండిస్తున్నారు. ప్రస్తుతం రెండో పంటగా మొక్కజొన్న, ఆముదం తదితర వాణిజ్య పంటలను సాగు చేశారు. ఈ సంవత్సరం వరి ధాన్యానికి మంచి ధర లభిస్తున్నందున సుమారు 20 వేల ఎకరాల్లో పంట సాగైందని వ్యవసాధికారులు పేర్కొంటున్నారు.

సన్మానం


హరిని సత్కరిస్తున్న బలిజ సంఘీయులు

డోన్ టౌన్: పట్టణ సచివాలయాల కన్వీనర్ పదవితో పాటు పార్టీ పట్టణ కన్వీనర్‌గా కురుకుందు హరిని నియమించిన సందర్భాన్ని పురస్కరించుకొని కాపు బలిజ సంఘం నేతలు సోమవారం శ్రీకృష్ణదేవరాయ భవన్‌లో హరిని ఘనంగా సత్కరించారు. సంఘం పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్, అధ్యక్షుడు కురుకుందు శేఖర్ మాట్లాడుతూ కాపుల అభివృద్ధికి హరి కృషి చేయాలిని కోరారు. ప్రభుత్వ సహకారంతో కాపు,బలిజల కోసం కమిటీ మాల్ నిర్మాణానికి ప్రయత్నించాలన్నారు. నాయకులు మధు, శివ, రామకృష్ణ, వెంకటేషులు, రమేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

అవుకు: మండలంలోని ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆటో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులుగా నూతనంగా ఎన్నికైన నాగాంజనేయులు, బాల హుసేని తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శివబాలకృష్ణ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. నాయకులు వెంకటేశ్వర్లు, విజయ్ నాయక్, హుసేనయ్య, రహంతుల్లా, మధు, కార్తీక్, వెంకట శివ, బాలునాయక్, సులేమాన్ పాల్గొన్నారు.

నేడు బైక్‌ల వేలం

బేతంచెర్ల: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 4 ద్విచక్ర వాహనాలకు మంగళవారం ఉదయం 10 గంటలకు పోలీస్ స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహిస్తున్నట్లు సీఐ ప్రియతం రెడ్డి సోమవారం తెలిపారు. వేలంలో పాల్గొన దలచిన వారు రూ.3 వేలు ధరావత్తు చెల్లించాలని సూచించారు.


గతంలో పైపెచ్చులు ఊడి కడ్డీలు కనిపిస్తున్న దృశ్యం (ఫైల్)


అధునాత సౌకర్యాలతో నిర్మించిన నూతన ఎంపీడీఓ కార్యాలయ భవనం

గతంలో అధ్వానం.. నేడు బ్రహ్మాండం

బనగానపల్లెరూరల్: ప్రజలకు మేలు చేయాలనే తపన, చిత్త శుద్ధి పాలకుల్లో ఉంటే అభివృద్ధి పరుగులు తీస్తుందనడానికి ఉదాహరణే పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం. ఏడాదిన్నర క్రితం వరకు శిథిలావస్థకు చేరిన కార్యాలయంలో సిబ్బంది నిత్యం ప్రాణాలు చేతిలో పెట్టుకొని పనిచేసేవారు. ఇక వర్షాకాలంలో వారి పరిస్థితి వర్ణణాతీతం. కార్యాలయంలోనికి వర్షపు నీరు ప్రవేశించడంతో పాటు కంప్యూటర్ల, రికార్డులపై వెలుస్తుండటంతో వాటిపై ప్లాస్టిక్ పట్టలు కప్పి, తడవకుండా కాపాడటానికి సిబ్బంది ఇబ్బందులు పడేవారు. టీడీపీ హయాంలో నూతన కార్యాలయం ఏర్పాటు చేయాలని పలుమార్లు విన్నవించినా చర్యలు శూన్యం. వసతుల సంగతి అటుంచి నూతన భవనం నిర్మించాలని వేడుకున్నా పట్టించుకోలేదు. అనంతరం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సమస్యను గుర్తించి వెంటనే కార్యాలయ నిర్మాణానికి చర్యలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చొరవతో ఎంపీడీఓ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి డీఎంఎఫ్ నిధుల కింద రూ.1.20 కోట్లు, మరో రూ.10లక్షలు మడల పరిషత్ నిధుల నుంచి మొత్తం రూ.1.30 కోట్లను గతేడాది మంజూరు చేయించారు. వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించి ఏడాదిలోపే అన్ని రకాల వసతులతో నూతన కార్యాలయ భవనాన్ని అందుబాటులోకి తెచ్చారు. పనులు పూర్తవడంతో గత నెల 25న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించారు. దీంతో మండల ప్రజలతో పాటు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత టీడీపీ పాలనలో శిథిలావస్థలో ఉన్న ఎంపీడీఓ కార్యాలయం పట్టించు కొని అప్పటి పాలకులు తమకు ఆదాయం వచ్చే ఇదే కార్యాలయ ఆవరణంలో ఉన్న పాదుపు భవనాన్ని కొద్ది పాటి పనులు చేసి, తమ శిలా ఫలకాలను పెట్టుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు


ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డోన్ ఆర్డీఓ, డీఎస్పీ, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ

బేతంచెర్ల: నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు ఆసుపత్రుల్లో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవని ఆర్డీఓ వెంకటరెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ బాలజీ హెచ్చరించారు. గత నెల 25న డాక్టర్ బ్రహ్మారెడ్డి ప్రజా వైద్యశాలలో లింగనిర్ధారణ పరీక్ష అనంతరం అబార్షన్ చేయించుకున్న ఓ మహిళ వైద్యం వికటించి 26న మరణించింది.బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్యురాలిపై చర్యలు తీసుకోవాలని, గతంలో ఇదే ఆసుపత్రిలో జరిగిన మరణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ 6న స్పందనలో నంద్యాల జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ, డీఎస్పీ, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ సోమవారం చర్చించారు. అనంతరం ఆర్.బుక్కాపురం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను విచారించారు. అనంతరం పట్టణంలోని డాక్టర్ బ్రహ్మారెడ్డి ప్రజా వైద్యశాలలో విచారణ చేపట్టారు. వారు మాట్లాడుతూ నివేదికను కలెక్టర్‌కు పంపుతామని ఆర్డీఓ, డీఎస్పీ వెల్లడించారు. తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, సీఐ ప్రియతం రెడ్డి పాల్గొన్నారు.